# చెట్టంత ఎదగనీ

కిటికీలు, తలుపులు మూసేసుకుని గదిలో కూర్చున్నా కామాక్షమ్మకు ఇంకా గుండెల మీద ఎవరో సమ్మెటతో మోదుతున్నట్టుగానే వుంది. తాళ్ళూ, పారలు, పలుగులు గొడ్డళ్ళు పట్టుకుని వచ్చి పొద్దున్నే పనిలోకి దిగిపోయిన నలుగురు కూలివాళ్ళు ఒకరినొకరు ఉత్సాహపరచుకుంటూ అరుస్తూ కేకలు పెడుతూ అంత పెద్ద చెట్టునీ లొంగదీయడానికి ఆపసోపాలు పడుతున్నారు. చెట్టుమీద పడుతున్న ఒక్కొక్క గొడ్డలి వేటు తన గుండెమీదనే పడుతున్నట్టుగా గుండె దడదడ లాడుతున్నది కామాక్షమ్మకు.

పాతికేళ్ళ క్రిందట కాళహస్తికి వెళ్ళినప్పుడు కొనుక్కొచ్చారు. ఆ టెంకాయ పిలకలు. గంగాబోండాం చెట్లనీ. చేతికి అందే ఎత్తులోనే కాయలు కాపుకాస్తాయనీ ఊరించాడు అమ్మిన ఆసామీ. మొక్క వడలిపోకుండా దారిపొడుగునా తడిగుడ్డ కప్పి వుంచి, ఇంటికి వచ్చి రాగానే, పాలుపోసే సోమప్పతో గొప్పులు తీయించి ఎరువుమట్టి వేసి మొక్కలు పాతారు. అప్పటికి సుధాకరం పదేళ్లవాడు. అమ్మ చెట్ల మొదట్లో నీళ్ళు పెడుతూంటే తానూ గిన్నెలో నీళ్ళు తెచ్చి పోసేవాడు.

వాడే ఇవాళ మొండి పట్టుదలతో ఆ రెండు చెట్లనీ కొట్టించేస్తున్నాడు. అవి తాడి చెట్లలా పొడుగ్గా పెరిగాయి. కానీ ఇంటి వాడుకకు సరిపడా కాయలు కూడా ఇవ్వవు. నేల బాగులేదో, చెట్టు జాతి అంతేనో మరి. అయితే ఇంటి పక్కనున్న ఖాళీ స్థలమంతా పందిరేసినట్టు నీడ నిచ్చేవి కొబ్బరి మట్టలు.

ఆ దండగమారి చెట్లు కొట్టేసి, ఆ జాగాలో రెండు వాటాలు కట్టిస్తే నెలకు పదివేలు వస్తాయని వాడి ఆలోచన. రామచంద్రయ్య పదవీ విరమణ చేసాక జీతంలో సగంకన్న తక్కువ వస్తోంది పెన్షను. వయసుతో బాటు మీదపడ్డ బీ.పి ఆర్థ్రైటిస్ వంటి రోగాలకు మందులకు తమ ఖర్చులకు చాలీచాలకుండా వున్నదా మొత్తం. ఒక్కడే కొడుకు గనుక వాడి నీడలోనే గడుపుతున్నారు కామాక్షమ్మ రామచంద్రయ్య. ఉన్న ఒక్క కూతురూ పెళ్ళై హైద్రాబాదులో వుంది.

సుధాకరం బాగానే సంపాదిస్తాడు. అతడి భార్య నీరజ పెద్దగా చదువుకోలేదు. ఇద్దరు కొడుకులు వాళ్ళకు. వాళ్ళిద్దర్నీ కార్పోరేట్ కాలేజీల్లో చదివించి, ఇంజనీర్లని చేసి, అమెరికా పంపించాలని దంపతులిద్దరి ఆశ. అందుకే పెద్ద వాళ్ళిద్దరికీ ఇష్టం లేక పోయినా,

చెవినిల్లుకట్టుకుని పోరి తండ్రి రిటైర్‌మెంటు డబ్బుతో పక్కనున్న స్థలంలో పైనాకిందా నాలుగు గదులు కట్టించడానికి ఒప్పించాడు. నీరజ బ్యూటీషియన్ కోర్సు చేస్తోంది గనుక మేడమీది గదులలో బ్యూటీ పార్లర్ పెడితే వద్దన్నా డబ్బు వస్తుందని ఆలోచన.

ఇల్లు కట్టడానికి మొదటి మెట్టు అక్కడున్న చెట్లు కొట్టేయడం. పచ్చని చెట్లను కొట్టడం దేనికి. వాటిని అలాగే వుంచి మిగతాచోట్ల కడదామని నచ్చజెప్పచూసారు కామాక్షమ్మ. రామచంద్రయ్య. పనికిరాని చెట్లకోసం అంత విలువైన స్థలాన్ని వృధా చేయడం శుద్ధ దండుగ అంటూ వాళ్ళ మాట కొట్టి పడేసాడు సుధాకరం.

అంత పెద్ద చెట్లను కొట్టేయడం ఆషామాషీ వ్యవహారం కాదుకదా! మూడు భాగాలుగా నరుకుతారుట. ఇంటి ముందున్న ప్రహారీ గోడమీద గానీ, పక్కింటి గోడమీద గానీ పడకుండా పైభాగానికి తాళ్ళు కట్టి పట్టుకున్నారు. ఇద్దరు పనివాళ్ళు. పైకెక్కి గొడ్డలితో బలమంతా ఉపయోగించి ఏట్లు వేస్తున్నాడొకడు. ఇదంతా చూడలేక గదిలో కిటికీలు, తలుపులు బిగించుకుని కూర్చుండిపోయింది కామాక్షమ్మ. రామచంద్రయ్య పొద్దున్నే ఇంటి దగ్గరే వున్న శివాలయానికి వెళ్ళి కూర్చున్నాడు.

టెంకాయ చెట్టుపై భాగం తెగినట్టుంది. ఫెళఫెళమని చప్పుడు దానితో బాటు 'ఆ పక్కకి ఇగ్గమంటుంటే ఇనపడలా?' 'నువ్వు తప్పుకో', 'గోడమీద పడకుండా చూడండిరా' అంటూ కేకలు వినబడి, భరించలేనట్టు చెవులు మూసుకుంది కామాక్షమ్మ.

సుధాకరం పెళ్ళికీ, వాణి పెళ్ళికే కాక ఆ కాలనీలో ఎవరింట్లో పెళ్ళి అయినా ఈ చెట్ల మట్టలు కావాల్సిందే. ఇన్నేళ్ళుగా ఎండాకాలం ఇంట్లోకి వేడి గాడ్పులు కొట్టకుండా కాపాడాయి. 'ఈ రోజుతో వాటితో రుణం తీరిపోయింది' అనుకుంటే దుఃఖం ముంచుకొచ్చింది కామాక్షమ్మకు.

సైకిళ్ళు బాగుచేసే రంగయ్య అంగడి బాడుగ కట్టలేదని ఖాళీ చేయమన్నార్ట. నాలుగు కమ్మలు పాతి, తడికె కప్పి షాపు నడుపుకుంటానయ్యా అంటూ చెట్ల మానులు లాక్కుపోయాడు. ఎండితే నీళ్ళ పొయ్యిలోకి వస్తాయంటూ కొబ్బరి మట్టలు తీసుకుపోయింది ఆ పక్కింటి ఆమె. సాయంకాలానికల్లా పందిరి తీసేసిన ఇల్లులా కళదప్పి నిలబడింది కామాక్షి నిలయం.

ఆ రాత్రి అన్నం తినలేదు కామాక్షమ్మ గ్లాసెడు మజ్జిగ త్రాగి పడుకున్నాడు రామచంద్రయ్య. వాళ్ళే సర్దుకుంటారన్నట్టు గమ్మునుండి పోయారు కొడుకు కోడలు.

రెండు రోజులు తిరక్కుండానే పునాదులు తవ్వే పని మొదలయింది. వీధి ముఖం చూడకుండా లోపలే నీరసంగా తిరుగుతున్న నాయనమ్మ దగ్గరకు పరుగున వచ్చాడు సుధాకరం పెద్దకొడుకు వాసు. "తాత ఏం చేస్తున్నాడో చూద్దువురా నానమ్మా" అంటూ ఆవిడ చెయ్యి పట్టుకుని వీధిలోకి లాక్కొచ్చాడు. ఇంటి ఎదురుగా, రోడ్డుకు అటుపక్కన నాలుగు గుంతలు తీయించి, మొక్కలు నాటిస్తున్నాడు రామచంద్రయ్య.

పొద్దున్నే సి.క్యాంపు సెంటరులో రైతు బజారు పక్కన కడియం నుండి తెచ్చిన పూలమొక్కలతో బాటు అన్నిరకాల మొక్కలు అమ్మే వాళ్ళ దగ్గర నుండి వేప, మారేడు, రావి, సుంకేసుల మొక్కలు కొనుక్కొచ్చాడాయన.

పాల పాకెట్లు వేసే ప్రసాదు గడ్డపారతో నేలలో మూరెడు లోతున తవ్వి, మొక్కలు పాతి, ప్లాస్టిక్ బక్కెట్టుతో నీళ్ళు తీసుకొచ్చి పోసాడు. రామచంద్రయ్య ఇచ్చిన యాభై రూపాయల నోటుని ఆనందంగా అందుకుని వెళ్ళిపోయాడు.

'అరవై దాటిన ఈ ముది వయసులో ఈయనకు ఇదేం ఆలోచన? ఇవి ఎప్పటికి ఎదిగేను? అవి కొమ్మా రెమ్మా తొడిగి నిలువత్తు చెట్టయ్యే రోజు తమ కళ్ళారా చూస్తామా?' అనుకుంటూ నడుము మీద చెయ్యి ఆన్చి నిలబడి చూస్తున్న కామాక్షమ్మను చూసి చిన్నగా నవ్వేడు రామచంద్రయ్య. నిజానికి రోడ్డుకి అటుపక్కన పార్కు వుంది. పేరుకే పార్కు గానీ అందులో చెట్లంటూ ఏమీ లేవు. అక్కడ దగ్గర్లో వున్న స్కూలు పిల్లలు ఎండలో పడి ఆడుతుంటారు ఆ పార్కులో. ఈ చెట్లు వస్తే ఆ పిల్లలకీ నీడ దొరుకుతుంది సేదదీరడానికి' అనుకుంటూ ఇంట్లోకి వచ్చింది కామాక్షమ్మ. వాసు ఇంట్లోనుండి చిన్న బిందెతో నీళ్ళు పట్టుకొస్తూ ఎదురయ్యాడు. చిన్నప్పటి సుధాకరమే కళ్ళలో మెదిలాడామెకు.

మర్నాడు పొద్దున్న పది గంటలకు కలెక్టరాఫీసుకు వెళ్ళి అక్కడ వాళ్ళ నడిగి చెట్లకి రక్షణగా ఇనుప తీగెలతో చేసిన 'ట్రీగార్ట్స్' బండిలో వేయించుకొచ్చాడు రామచంద్రయ్య. ప్రసాదును పిలిచి ఒక్కొక్క మొక్కమీద నుండి అవి దింపించి, ఎవరూ లాగేయకుండా భూమిలోకి పాతించేడు. ఎవరూ నిద్రలేవకముందే వాటికి నీళ్ళు పోసేసాడు గనుక తేటగా నవనవలాడు తున్నాయి మొక్కలు.

రోజూ పొద్దున్న రామచంద్రయ్య, సాయంత్రం కామాక్షమ్మ వంతులు వేసుకుని నీళ్ళు పెడుతున్నారు చెట్లకి. ఆ మొక్కల వైపు మేకలు గానీ, గేదెలు గానీ వచ్చాయంటే ఇంట్లోనుండి కట్టె పట్టుకుని వచ్చి మరీ తరుముతున్నాడు ఆయన. ఆ ముసలి దంపతుల తాపత్రయం చూసి కాలనీలో కొందరు నవ్వుకుంటున్నారు.

ఇల్లు పూర్తవ్వడానికి ఆరు నెలలు పట్టింది. ఇంటి గోడలు పైకి లేచినట్లే వేప, రావి, మారేడు, సుంకేసుల చెట్లు కూడా పైకి ఎదిగాయి.

పెళ్ళై అమెరికాలో వుంటున్న కూతురి కాన్పుకోసం కామాక్షమ్మ కూతురు వాణి, అల్లుడు రమణ అమెరికా ప్రయాణమయ్యారు. వాణి సుధాకరంకన్న పెద్దది. ఆమె కొడుకు సెంట్రల్ స్కూల్లో పదో క్లాసు చదువుతున్నాడు. వాన్ని చూసుకోడానికని కామాక్షమ్మ, రామచంద్రయ్య హైద్రాబాదు వెళ్ళాల్సి వచ్చింది. పెద్దవాళ్ళకు కష్టంలేకుండా వాణి వంటమనిషిని ఏర్పాటు చేసింది. అల్లుడు మూడు నెలలలో వెనక్కి వస్తాడుట. వెళ్ళేముందు ఇంట్లో పనిచేసే సావిత్రిని చాటుగా పిలిచి రోజూ ఆ చెట్లకు నీళ్ళు పోయమని, అందుకు

గాను తను వేరుగా కొంత డబ్బు ఇస్తాననీ ఒప్పించింది కామాక్షమ్మ. ఆమెకు చెప్పకుండా రంగయ్యకూ చెట్లకు నీళ్ళు పోసే పని ఒప్పగించాడు రామచంద్రయ్య. సావిత్రి రంగయ్య భార్యే!

ఆరు నెలలు హైద్రాబాదులో వున్నా వాళ్ళ ప్రాణాలన్నీ కర్నూల్లో చెట్లమీదే వున్నాయి. రంగయ్య సెల్‌ఫోనుకు ఫోను చేసి వాటి యోగక్షేమాలు అడుగుతూనే వున్నాడు రామచంద్రయ్య.

దంపతులిద్దరూ కర్నూలు తిరిగి వచ్చేసరికి చేయి జాపితే అందనంత ఎత్తు ఎదిగి పోయాయి నాలుగు చెట్లూ. సుంకేసుల అయితే పూలు పూచింది కూడ. వాటిని చూస్తుంటే నిలువెత్తు టెంకాయ చెట్లు కొట్టేయించిన పాపం కాస్త ఉపశమించి నట్టనిపించింది. వాళ్ళిద్దరికీ. వాటికి నీళ్ళు పోసే బాధ్యతలు మళ్ళీ స్వీకరించాడు.

కామాక్షమ్మ వచ్చిన మర్నాడే పలుకరించడానికి వచ్చింది పక్కింటి సరస్వతమ్మ. "వేప చెట్టుకు రావిచెట్టుకు పెళ్ళి జరిపించండి. పుణ్యం వస్తుంది" అఇ సలహా ఇచ్చిందామె. చెట్ల నీడన కూర్చుని అన్నాలు తింటున్న మట్టి పనిచేసే కూలీలను చూస్తూ "నలుగురికి నీడనిస్తున్నాయి. ఆ పుణ్యం చాల్లేమ్మా! అంది కామాక్షమ్మ. సరస్వతమ్మ మూతి ముడుచుకుని వెళ్ళిపోయింది.

ఇంకా పూర్తిగా మాను బలియని వేపచెట్టు కొమ్మలు వంచి పళ్ళు తోముకోడానికి పుల్లలు విరిచే కూలీలను కోప్పడతాడు రామచంద్రయ్య. ఒకరోజు కూరగాయలమ్మే లక్షుమమ్మ వేపాకు దూసి సంచినిండా వేసుకుంటుంటే కామాక్షమ్మ బయటకు వచ్చి "ఆ చెట్టు పైకి రాకముందే కొమ్మలు విరిచేస్తావేమో" అంటూ అరిచింది.

"నా బిడ్డకు తట్టుపోసిందమ్మా. ఒళ్ళంతా దురద అంటూ గోక్కుంటూంది. పక్కమీద వేపాకు పరిస్తే అయి తగ్గుతాయని ఆయమ్మ చెప్పింది... అందుకని.." అంటూ గొణిగింది లక్షుమమ్మ.

"అట్లానా? నీళ్ళు పోసే రోజు నీళ్ళలో వేపాకు, పసుపు వేసి మర్లించి చల్లారబెట్టి నీళ్ళు పోయి. మచ్చలు, గుంటలు పడవు" అంటూ జాగ్రత్తలు చెప్పింది కామాక్షమ్మ.

సైకిలు రిపేర్లు చేసే రంగయ్యను పెద్దాసుపత్రిలో చేర్పించారని తెలిసింది. సావిత్రి రెండురోజులు పనిలోకి రాలేదు. మూడోరోజున వచ్చినప్పుడు ఏడ్చుకుంటూ చెప్పింది" రెండు మూత్రపిండాలు చెడిపోయినాయంట. బ్రతికేది కష్టమంటున్నారు" అని.

"అయ్యో" అంది కామాక్షమ్మ.

"అంత తాగితే కిడ్నీలు చెడిపోక ఏమౌతుంది? సంపాదనంతా సారా కొట్టుకే పెట్టినాడంటివే". ఈసడింపుగా అంది నీరజ.

"రాత్రి అలంపురం దగ్గర బస్సు ప్రమాదం జరిగిందంట. పది మంది చావుబతుకుల్లో వున్నారని పెద్దాసుపత్రిలో చేర్చారట. అందులో నలుగురు బ్రతికేది

కష్టమేనన్నారట డాక్టర్లు. ఎట్లాగూ పోతున్నారు వాళ్ళ కళ్ళు, కిడ్నీలు ఆసుపత్రికి దానం చేయమని ఎవరో హౌస్ సర్జను అడిగాడట. వాళ్ళ బంధువులంతా కలిసి ఆ హౌస్ సర్జన్‌ని చితకబాదారంట!" అప్పుడే ఇంటికి వచ్చిన సుధాకరం చెప్పాడు.

పొద్దున్న పది గంటలప్పుడు పాల పాకెట్లు వేసే ప్రసాదు పైకి ఎగిరి రావి ఆకులు కోస్తుంటే, కట్టె పట్టుకుని బయటకు వురికాడు రామచంద్రయ్య. "నీ చేత్తో పాతిన చెట్టును బతకనీయవేంట్రా? ఎందుకట్లా కొమ్మలు విరుస్తావు?" అంటూ కోప్పడ్డాడు.

"కాళ్ళ మడిమెలు పగిలి బోనొప్పి చేస్తాందయ్యా! ఈ ఆకుపాలు రాస్తే పగుళ్ళు పోతయ్యంట... మాయమ్మ చెప్పింది" అన్నాడు వాడు బెదురుగా చూస్తూ.

"అట్లనా? నన్నడిగితే కోసియ్యనా?" అంటూ కట్టెతో రావి కొమ్మ వంచి ఆకులు తుంచి ఇచ్చాడు ఆయన.

"పొద్దున్నే ఆ హనుమాయమ్మ కోడలొచ్చి ఈ చెట్టు చుట్టూ తిరిగి దండం పెట్టుకుని పోయింది. మంత్రాలకు చింతకాయలు రాల్తాయా? రావి చెట్టు చుట్టూ ప్రదక్షిణ చేస్తే పిల్లలు పుట్టేస్తారా?" లోపలినుండి ఈ తతంగ మంతా చూస్తున్న నీరజ అత్తగారితో హేళనగా అంది.

దేవుడి ముందు దీపం వెలిగిస్తున్న కామాక్షమ్మ శాంతంగా జవాబిచ్చింది. "మన పెద్దవాళ్ళు చెట్లలో జంతువులలో కూడా దేవుడిని చూసారు. రావి చెట్టులో త్రిమూర్తులుంటారట. అందుకే "మూలతో బ్రహ్మ రూపాయ మధ్యతో విష్ణురూపిణే, అగ్రతః శివరూపాయ వృక్షరాజాయతే నమః" అని అశ్వత్థ వృక్షానికి నమస్కరిస్తారు. రావి పళ్ళు ఎండబెట్టి పొడిచేసి పటిక బెల్లం పొడితో కలిపి మందుగా తింటే పిల్లలు లేని ఆడవాళ్ళకు గర్భస్థ దోషాలు తగ్గి సంతానం కలుగుతుందని ఆయుర్వేద వైద్యులంటారు. భక్తితో ముడిపెడితే తప్ప నమ్మకం కలగదని ప్రదక్షిణలు చేయమన్నారు".

నీరజ జవాబు లేనట్టు వూరుకుంది.

కామాక్షమ్మ మారేడు దళాలను చేతిలో పట్టుకుని "త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రంచ త్రియాయుధమ్ త్రిజన్మ పాప సంహారం ఏకబిల్వం శివార్పణమ్" అంటూ భక్తిగా చిన్న స్పటిక లింగం మీద వుంచి నమస్కరించింది.

"మారేడుకాయలు కుమ్ములో పెట్టి ఆ గుజ్జు తలకు పట్టించుకుని తలంటుకుంటే జుట్టు పట్టు కుచ్చులాగుంటుందంట కదత్తయ్యా?" ఆవిడ పూజ ముగించాక నీరజ అడిగింది.

"హెర్బల్ బ్యూటీ పార్లర్" అని పేరు పెట్టావుగా.. .మరి ఇట్లాటివి వాడి చూపించు మరి.." అన్నదావిడ నవ్వుతూ.

రెండు రోజులలో రంగయ్య ఆస్పత్రిలో కళ్ళు మూసాడు. "ఎవరైనా కిడ్నీ

దానం చేసుంటే బతికేవాడంటమ్మా... నాది సరిపోదన్నారు..." పదిహేను రోజుల తర్వాత పనిలోకి వచ్చిన సావిత్రి కళ్ళు తుడుచుకుంటూ చెప్పింది.

ఆ రాత్రి కామాక్షమ్మకు నిద్రపట్టలేదు. నలభై ఏళ్ళకే చచ్చిపోయిన రంగయ్యే గుర్తుకొస్తున్నాడామెకు. తాగమని ప్రభుత్వమే ప్రోత్సహిస్తున్నట్టు ఎక్కడ చూసినా సారా షాపులు. వాళ్ళకు డబ్బు కావాలి... ఎవరు చస్తేనేం? ఎంతో ముఖ్యమైన పదవుల్లో వున్నవాళ్ళు స్కాముల్లో భాగస్వాములే! లక్షల కోట్లు కూడబెట్టినా ఆ డబ్బు ఒక క్షణకాలం ఆయుర్దాయాన్ని ఇవ్వగలుగు తుందా?" కారేరాజుల్ రాజ్యముల్ కల్గవే... వారేరీ సిరిన్ మూటగట్టుకుని పోవంగ జాలిరే" అన్న వివేకం మనిషికెందుకు కలగడం లేదు? ఆలోచనలతో ఆమె తల వేడెక్కింది.

'చెట్లు, జంతువులు కూడా తెలియకుండానే పరోపకారం చేస్తాయి. బ్రతికున్నప్పుడు నీడ నిచ్చి, ఫలాలనిచ్చిన చెట్టు తనని కొట్టేసినా ఇంటి వాసాలకో, తలుపులకో, వంట చెరకుగానో పనికొస్తుంది. ఆవులు పాలిస్తాయి. కుక్కలు కాపలా కాస్తాయి. జంతువులు చచ్చాక చర్మంతో చెప్పులు, సంచులు కుడతారు. బ్రతికున్నంత కాలం తన స్వార్థమే చూసుకునే మనిషి చచ్చాక ఎందుకూ పనికిరాదా శరీరం అనే వాళ్ళు... కానీ సైన్సు అభివృద్ధి చెందడంతో మనిషి శరీరావయవాలు మరొకరికి పనికొస్తాయంటున్నారు." ఆలోచనలతో తెల్లవారుతుండగా నిద్రలోకి జారుకుందామె.

పొద్దున్న స్నానం అదీ అయ్యాక గుండెలో మంటగా వుందనీ, అస్థిమితంగా వుందనీ కోడల్ని సాయం తీసుకుని ఆస్పత్రికి వెళ్ళింది కామాక్షమ్మ.

అక్కడినుండి రాగానే కోడలు భర్తతో ఫిర్యాదు చేసింది. " మీ అమ్మగారు ఆస్పత్రిలో ఏం చేసారో తెలుసా?"

"తను పోయాక తన శరీరంలో పనికి వచ్చే అవయవాలు దానం చేస్తున్నట్టు పత్రాల మీద సంతకాలు చేసి వచ్చారు."

"అదేం పనమ్మా? అందుకు మన శాస్త్రాలు, పద్ధతులు ఒప్పుకోవని తెలుసుకదా?" అన్నాడు సుధాకరం.

"ఆలోచన, తెలివి లేని జంతువులు, చెట్టుకూడా బ్రతికి వున్నప్పుడు, చచ్చాక కూడా ఇంకొకరికి ఉపయోగపడుతున్నాయి. ఇన్నాళ్ళూ నేనూ, నా పిల్లలూ అన్న స్వార్థం తోనే బ్రతికాను. ఇవాళ బాగున్నాను. రేపు ఎలాగుంటానో... శాస్త్రం పరోపకారం చేయొద్దని అనదురా.." అంది కామాక్షమ్మ ప్రశాంతంగా.

రామచంద్రయ్య కళ్ళకు కామాక్షమ్మ ఎంతో ఎదిగిపోయినట్టు కనిపించింది. 'రెండు చెట్లు కొట్టించేసారని నాలుగు మొక్కలు నాటి, పెంచి సంతోషపడ్డాడు తను. కానీ ఆవిడ చెట్లను చూసి ఎంత నేర్చుకుంది?' అనుకుంటూ కూర్చున్నాడాయన.

"ఇంతవరకు మీకు చెప్పకుండా ఏ పనీ చేయలేదు. పచ్చగా వున్నప్పుడూ గొడ్డలితో కొట్టేసినప్పుడూ ఒక రకంగానే నలుగురికీ ఉపయోగపడే చెట్టంత ఎదగాలనిపించి, మీకు చెప్పకుండా స్వతంత్రించాను. మీకు కోపం రాలేదుగా?" సాయంకాలం రామచంద్రయ్య చెట్లకు నీళ్ళు పెడుతుంటే నెమ్మదిగా అడిగింది కామాక్షమ్మ.

సాయం సమయంలో కలకల రావాలు చేస్తూ రావిచెట్టుమీద వాలుతున్న పక్షులను తలెత్తి చూసి "మనిషి తలచుకుంటే చెట్టంత ఎదగగలడని నాకూ దారి చూపించావు" అంటూ చిన్నగా నవ్వాడు రామచంద్రయ్య.

- ఆదివారం ఆంధ్రభూమి **20** నవంబర్ **2011**